

ఉప ఎన్నికల్లో భారీగా పోలింగ్...

ఎవరికి కలిసొచ్చేనో..?

- మూడు నియోజకవర్గాల్లో పోలింగ్
- కదిలివచ్చిన ఓటర్లు
- అమెరికా నుంచి వచ్చిన అనూష
- కుటుంబాలతో వచ్చి ఓట్లు వేసిన నాయకులు

బెంగళూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల్లో ప్రజలు పోటీపడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. హావేరి జిల్లా శిగ్గావి, రామనగర్ జిల్లా చన్నపట్టణ, బళ్ళారి జిల్లా సండూరు స్థానాలకు ఉప ఎన్నికల పోలింగ్ బుధవారం జరిగింది. మూడు నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ప్రజలు కేంద్రాలలో క్యూలో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటల సమయానికి చన్నపట్టణలో 84.26శాతం, శిగ్గావిలో 75.07శాతం, సండూరులో 71.47శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగింపు వివరాలు అందాల్సి ఉంది. ప్రతిచోటా ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద సందడి కొనసాగింది. ప్రతిష్టాత్మకమైన ఎన్నికలు కావడంతో వృద్ధులు, దివ్యాంగులను పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చి ఓటు వేయించారు. ప్రతిచోటా ఓటరు గుర్తింపు, ఆధార్ కార్డుల ద్వారానే ఎక్కువమంది ఓటు హక్కు వినియోగించుకున్నట్టు సమాచారం. చన్నపట్టణలో కాంగ్రెస్ అభ్యర్థి సీపీ యోగేశ్వర్ భార్యతో కలసి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే ఆయన కుమార్తె నిశా ఓటు వేసేందుకు సుముఖత చూపలేదు. పైగా నాకు ఏం న్యాయం జరిగిందని ఓటు హక్కు వినియోగించుకోవాలని సోషల్‌మీడియా ద్వారా ప్రశ్నించింది. సీపీ యోగేశ్వర్, కుమార్తె నిశాల మధ్య కొంతకాలంగా విభేదాలు ఉన్నాయి. సీపీ యోగేశ్వర్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఒక నిర్ణయంతో ఉన్నారని వారు ఎవరికి ఓటు వేయాలనేది తీర్మానించుకున్నారన్నారు. ఎక్కువ పోలింగ్‌శాతం నమోదు అవుతుందని భావిస్తున్నామన్నారు. మంత్రి జమీర్ అహ్మద్ వ్యాఖ్యలపై స్పందిస్తూ ఒకప్పుడు ఒకే బస్సుకు డ్రైవర్, క్లీనర్‌లా కుమారస్వామి, జమీర్ అహ్మద్‌లు కలసి ఉన్నారన్నారు.



శిగ్గావిలో బీజేపీ అభ్యర్థి భరత్ బొమ్మై



మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై

- బీజేపీ - జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి నిఖిల్ కుమారస్వామి నియోజకవర్గ వ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. భార్య రేవతితో కలసి తిరిగారు. ఆయన ఓటు హక్కు నియోజకవర్గంలో లేకపోవడంతో వినియోగించుకోలేకపోయారు. అభిమానుల ఇళ్లకు వెళ్లి విందు ఆరగించారు. ఇదే సందర్భంగా నిఖిల్ మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఆశీస్సులు అందిస్తారనే విశ్వాసం ఉందన్నారు.



చన్నపట్టణలో ఓటు వేసేందుకు వస్తున్న దివ్యాంగురాలు గౌరమ్మ



సండూరు నియోజకవర్గం కుడితినిలో ఓటు వేసిన నూతన దంపతులు

కుటుంబికులతో అభ్యర్థుల ఓట్లు

శిగ్గావిలో బీజేపీ అభ్యర్థి భరత్ బొమ్మై కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వినియోగించుకున్నారు. తండ్రి మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై కుటుంబీకులంతా ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి యాసిర్ అహ్మద్‌ఖాన్ పఠాన్ కుటుంబీకులు, బంధువులతోపాటు వచ్చి ఓటు వేశారు.



ఓటు వేసేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న సీపీ యోగేశ్వర్

అమెరికా నుంచి అనూష..

శిగ్గావి నియోజకవర్గంలో ఓటు వేసేందుకే అమెరికా నుంచి అనూష అనే యువతి వచ్చారు. శిగ్గావిలోని మమ్లదేశాయ్ స్కూల్‌లో ఓటు వేశారు. ఆమె మాట్లాడుతూ అమెరికాలోని టెక్సాస్‌లో నివసిస్తున్నారు. సుదూరం నుంచి రావడాన్ని ఇబ్బందిగా భావించడం లేదని, అయితే నా ఓటు హక్కు వినియోగించుకున్నందుకు సంతృప్తిగా ఉందన్నారు. నాయకత్వ లక్షణాలు ఉన్నవారిని ఎన్నుకోవడం అందరి కర్తవ్యమన్నారు. మా నియోజకవర్గం అభివృద్ధి చెందాలనేది ఆశయమన్నారు. కాగా గత ఎన్నికల స్వీప్ రాయబారిగా వ్యవహరించిన గాయకుడు హనుమంతలమాణి బిగ్‌బాస్ హౌస్‌లో ఉన్నందున ఓటు వేయలేకపోయారు. తండ్రి మేగప్ప, తల్లి శీలవ్వతో పాటు కుటుంబికులు ఓటు వేశారు. తండ్రి మీడియాతో మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల్లో హనుమంత ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రచారం చేశారని ప్రస్తుతం అందుబాటులో లేరన్నారు.



పోలింగ్ శాతం ఇలా...						
నియోజకవర్గం	9గం.	11గం.	1గం.	3గం.	5గం.	ఫైనల్
చన్నపట్టణ	10.34	27.02	48.15	67.63	84.26	88.80
శిగ్గావి	10.08	26.01	43.5	59.62	75.07	80.48
సండూరు	9.9	25.96	43.46	58.27	71.47	76.24

సండూరులో పోలింగ్ ప్రశాంతం

బళ్లారి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నిక పోలింగ్ బుధవారం చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా కొన్ని గ్రామాల్లో 6 గంటలకు పోలింగ్ ముగిసింది. మరి కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటల వరకూ సాగింది. ఉదయం ఓటు వేసేందుకు జనం కదలివచ్చారు. అయితే కొన్ని గ్రామాల్లో ఓటర్లు ముందుకు రాలేదు. కుడితినిలో మహిళలు పెద్ద సంఖ్యలోనే వచ్చి ఓటు వేశారు. మరికొన్ని గ్రామాల్లో వివాహాల కారణంగా ఉదయం ఓటు వేసేందుకు రాలేదు. అనంతరం నాయకులు వెళ్లి ఓటింగ్‌కు రప్పించారు. సండూరు పట్టణంలో 51వ బూత్‌లో 91 ఏళ్ల వృద్ధురాలు ఓటు వేసింది. సండూరులో కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ, భర్త ఎంపీ తుకారాం కుటుంబంతో వచ్చి ఓటు వేశారు. బీజేపీ అభ్యర్థికి ఇక్కడ ఓటు లేక పోవడం వల్ల ఆయన ఓటు హక్కును వినియోగించుకోలేదు. గ్రామాల్లో పోలింగ్ బూత్‌లు దూరంగా ఉండడంతో ఆటోల్లో ఓటర్లను తరలించి ఓటుహక్కు వినియోగించుకునేలా చేశారు.



ఓటు వేసేందుకు క్యూకట్టిన మహిళలు

- సండూరు నియోజకవర్గంలో 2,36,402 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,18,438 మంది మహిళలు, 1,17,935 మంది పురుషులు, మిగిలిన ఇతరలు ఉన్నారు. ఓటింగ్ సరళి తగ్గకుండా రెండు పార్టీల నాయకులూ దగ్గరుండి ఓటర్లను తీసుకొచ్చారు. కొన్ని బూత్‌ల వద్ద రెండు పార్టీల వారినీ చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి చేశారు. తారానగర్, ఇతర ప్రాంతాల్లో తక్కువ ఓట్లు ఉండే పోలింగ్ బూత్‌ల్లో అనుకున్న సమయం కన్నా ముందే పోలింగ్ ముగిసింది. జిల్లా ఎస్పీ శోభ, డీసీ ప్రశాంత్, ఎన్నికల అధికారులు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తిరుగుతూ శాంతిభద్రతలను పర్యవేక్షించారు. తోరణగల్లు, కుడితిని, దరోజి, సండూరులో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటుకోసం ప్రచారం చేస్తున్నారని ఇరు పార్టీల నాయకులు వాగ్వాదానికి దిగారు. అక్కడే ఉన్న పోలీసులు వీరికి నచ్చజెప్పి పంపించారు. మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.



ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ, భర్త ఎంపీ తుకారాం, కుటుంబ సభ్యులు

తప్పుడు కేసులతో

నా భార్యను ఇబ్బంది పెట్టారు: సీఎం

- టి.నరసీపురలో రూ.470 కోట్ల పనులకు భూమిపూజ

బెంగళూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తప్పుడు కేసులతో నా భార్యను ఇబ్బంది పెట్టారని, నేను 40ఏళ్ల క్రితమే మంత్రిని అయ్యానని, 14 ఇంటి స్థలాలకోసం ఎందుకు తప్పు చేస్తానని సీఎం సిద్దరామయ్య ప్రశ్నించారు. టి నరసీపురలో బుధవారం రూ.470 కోట్లతో అభివృద్ధి పనులు, సంక్షేమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఐటీలను దుర్వినియోగం చేస్తోందన్నారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఇబ్బంది పెట్టారని ప్రస్తుతం నన్ను, నా భార్యను టార్గెట్ చేశారన్నారు. బీజేపీ రాష్ట్రంలో ఇప్పటివరకు సొంత మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. ఆపరేషన్ కమల ద్వారా మాత్రమే అధికారంలోకి వచ్చిందని, ఈసారి 50 మంది ఎమ్మెల్యేలకు తలా రూ.50కోట్లు ఆఫర్ ఇచ్చారని ఆరోపించారు. యడియూరప్ప, బొమ్మై, అశోక్‌లకు ఇంత సొమ్ము ఎక్కడనుంచి వచ్చిందని, వారేమైనా ప్రింట్ వేశారా..? అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఐదు గ్యారెంటీల అమలుపై బీజేపీ, జేడీఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 1.20 లక్షల కోట్లు అభివృద్ధికి కేటాయించిందన్నారు. టి నరసీపుర రూపురేఖలు మారనున్నాయన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్పతోపాటు మంత్రులు వెంకటేశ్, ఎంసీ సుధాకర్, ఎంపీ సునిల్‌బోస్, గ్యారెంటీ అమలు కమిటీ వైస్ ఛైర్మన్ పుష్ప అమరనాథ్, ఎమ్మెల్సీలు యతీంద్ర సిద్దరామయ్య, డాక్టర్ తిమ్మయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు.



ట్రైసైకిళ్ల పంపిణీలో పాల్గొన్న సీఎం సిద్దరామయ్య

రూ.187 కోట్ల వసూలుకు

కున్హా కమిషన్ సిఫారసు

బెంగళూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కొవిడ్ నిర్వహణ వేళ కొనుగోళ్లలో నిబంధనలు ఉల్లంఘనకు భారీ నష్టం వాటిల్లిందనీ, ఇందులో రూ.187.80 కోట్లు వసూలు చేయాలని కొవిడ్ అక్రమాలపై విచారణ జరుపుతున్న మాజీ న్యాయమూర్తి మైఖేల్ డి కున్హా కమిషన్ మధ్యంతర నివేదికలో సిఫారసు చేసింది. కొవిడ్ నిర్వహణలో అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం కున్హా కమిషన్ ఏర్పాటు చేసిన సంగతి విదితమే. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ద్వారా రూ.1754 కోట్లు ఖర్చు చేశారు. 13 విభాగాల కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్టు కమిషన్ గుర్తించింది. ఇందులో నిర్మాణ పనులకు రూ.84.71 కోట్లు అనవసరంగా ఖర్చు చేశారని, రూ.14.21 కోట్లు విదేశాలనుంచి పీపీఈ కిట్‌లు దిగుమతికోసం చైనా కంపెనీకి రెండుసార్లు రవాణా ఖర్చుల ద్వారా నష్టమని, రూ.9.99 కోట్లు విలువైన వైద్య పరికరాలు, ఔషధాలు సమకూర్చడంలో జాప్యం, 71 విభాగాలలో వసూలు చేయాల్సిన జరిమానాల పట్ల నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. మార్కెట్‌లో తక్కువధరకే అందుబాటులో ఉన్నా 21 విభాగాలకు రూ.8.03 కోట్లు అదనంగా ఖర్చు చేశారని, రూ.5.73 కోట్లు గడువు ముగిసిన మందులు సరఫరా చేసిన 79 కేసుల్లో వసూళ్లు చేయలేదన్నారు. రూ.4.14 కోట్ల విలువైన అంబులెన్స్ సేవలు రికార్డులు లేకుండా ఖర్చు చేశారని, హెల్ప్‌లైన్ విభాగానికి, బీపీఓలకు రూ.5.61 కోట్లు అదనంగా చెల్లించారని, ఐసీఎంఆర్ గుర్తింపులేని 8 ల్యాబ్‌లకు అక్రమంగా రూ.4.29 కోట్లు చెల్లించారని, కొవిడ్ పరీక్షలకు సామర్థ్యం లేకున్నా 6 ల్యాబ్‌లకు రూ.2.64 కోట్ల చెల్లింపులు చేశారన్నారు. బీఎంటీసీ ద్వారా ప్రచారం చేసేందుకు చుక్కి థియేటర్స్ సంస్థకు రూ.8.85 లక్షలు చెల్లించారని మధ్యంతర నివేదికలో పొందుపరిచారు. సీఎం యడియూరప్ప, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీరాములు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, వ్యక్తిగత లాభం పొందారని నివేదికలో ప్రస్తావించారు. ఈ వ్యవధిలో కొనుగోలు చేసిన చైనా కంపెనీ నుంచి కూడా వసూలు చేయాలని సిఫారసు చేశారు. ఆ తర్వాత బసవరాజ్ బొమ్మై సీఎంగా ఉన్నప్పుడు కొన్ని కొనుగోళ్లకు సంబంధించి ఒప్పందాలపైనా వసూలు చేయాల్సి ఉందని కమిషన్ సిఫారసు చేసింది.



సిఫారసు అమలుకు ఆప్ డిమాండ్

కాగా ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంజప్ప కాళేగౌడ మాట్లాడుతూ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న యడియూరప్ప, అప్పటి మంత్రులు సుధాకర్, అశ్వత్థనారాయణ, శ్రీరాములను అరెస్టు చేయాలన్నారు. వారి నుంచి రూ.187 కోట్లు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ న్యాయమూర్తి నివేదికకు అవమానం చేయరాదని సూచించారు. సీఎం సిద్దరామయ్య అడ్జస్ట్‌మెంట్ రాజకీయాలను వీడి ప్రభుత్వ ఖజానాకు మోసం చేసినవారిపై వెంటనే అరెస్టు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



డిసెంబరులో మంత్రివర్గ

ప్రక్షాళన?

- ఆరేడుగురు మంత్రులకు ఉద్వాసన
- ఆరోపణలున్న మంత్రుల స్థానంలో కొత్తవారు
- నాగేంద్రకు మరో ఛాన్స్..?

బెంగళూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మూడు స్థానాలకు శాసనసభ ఉప ఎన్నికలు ముగియగానే మంత్రివర్గ ప్రక్షాళనకు సీఎం సిద్దరామయ్య కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రాథమికంగా అధిష్ఠానం కూడా ఇందుకు సానుకూలత వ్యక్తం చేసే అవకాశాలు ఉన్నాయి. ఉప ఎన్నికలకు ముందే ముఖ్యమంత్రి మార్పు అనే అంశం తెరపైకి రాగా ఎవరికి వారుగా వ్యాఖ్యానించడం, గ్రూపులుగా రహస్య సమావేశాలు జరపడంపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మండిపడిన విషయం తెలిసిందే. అత్యవసరంగా బెంగళూరుకు వచ్చి మంత్రులను తీవ్రస్థాయిలో మందలించిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో నిర్లక్ష్యంగా బాధ్యతలేకుండా వ్యవహరిస్తే కేబినెట్ ప్రక్షాళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగానే డిసెంబరులో ప్రక్షాళన ఉంటుందనే చర్చలు జోరందుకున్నాయి. మూడు శాసనసభ స్థానాలకు బుధవారం పోలింగ్ జరిగింది. పది రోజుల తర్వాత 23న కౌంటింగ్ ఉంటుంది. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు కూడా అప్పుడే వెలువడతాయి. ఎన్నికల ఫలితాల తర్వాత వెంటనే ఢిల్లీలో రాజకీయాలు కొనసాగించడం అంత సులువుకాదు. రెండు రాష్ట్రాల ఫలితాలపై అధిష్ఠానం పెద్దలు సహజంగానే బిజీగా ఉంటారు. నవంబరు ఆఖరుదాకా ప్రస్తావన తీసుకురాకుండా డిసెంబరు మొదటివారంలో సీఎం, డీసీఎంలు ఢిల్లీ వెళ్లే అవకాశాలు ఉన్నాయి.

- మరోవైపు ముడా వివాదంలో సీఎం సిద్దరామయ్యపై ఒత్తిడి పెరుగుతోంది. ఆయన వ్యక్తిగత కార్యదర్శిని ఈడీ విచారణ చేపట్టింది. మరోవైపు ముడా భూముల పరివర్తన చేసిన సమయంలో జిల్లా అధికారిగా వ్యవహరించిన ప్రస్తుత రాయచూరు లోక్‌సభ సభ్యుడు కుమారనాయక్‌ను బుధవారం ఈడీ విచారణ జరిపింది. ఇలా ముడా వివాదం ముంచుకొస్తున్న తరుణంలో అధిష్ఠానం మంత్రివర్గ ప్రక్షాళన ద్వారా గ్రూపులకు అవకాశం లేకుండా చేయాలనే ఆలోచన ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవల పలువురు మంత్రులపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఎంబీ పాటిల్, ప్రియాంక ఖర్గేలపై భూ ఆక్రమణల ఆరోపణలు రాగా ఎక్సైజ్ శాఖ ద్వారా కోట్లాదిరూపాయలు వసూలు చేశారని సంబంధిత మంత్రి ఆర్‌బీ తిమ్మాపురపై ఆరోపణలు వచ్చాయి. మరోవైపు బెళగావి తహసీల్దారు కార్యాలయంలో ఉద్యోగి ఆత్మహత్య వివాదంలో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పీఏపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ఇలా ఆరోపణలతోపాటు క్రియాశీలకంగా లేని, తరచూ వివాదాలకు కారణమవుతున్న మంత్రులను పక్కనపెట్టాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలుస్తోంది. వీరిలో ఆర్‌బీ తిమ్మాపుర, ఎస్ఎస్ మల్లికార్జున, కేఎన్ రాజణ్ణ, బోసరాజుతోపాటు పలువురి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. శాఖాపరంగా నిర్లక్ష్యంతో ఉన్నవారిని పక్కన పెట్టే అవకాశం ఉంది. ఇలా వివిధ కోణాలలో ఆరేడుగురు మంత్రులను తప్పించి జిల్లాల వారీగా ప్రాతినిథ్యం ఉండేలా కొత్తవారికి చోటు కల్పించాలని అధిష్ఠానం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది.
- ప్రక్షాళన నాటికి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతి నుంచి నాగేంద్ర బయటపడితే ఆయన మరోసారి కేబినెట్‌లో చేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలమైనా పాలనలో మంత్రుల భాగస్వామ్యం ఆశాజనకంగా లేదని అధిష్ఠానం పరిగణించినట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు శాఖలపై కనీసస్థాయిలో సమీక్షలు కూడా జరపని మంత్రుల నివేదికను కోరినట్టు తెలుస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో డిసెంబరు సంచలనాలకు కారణం కానుందని విశ్లేషకులు అంటున్నారు.

నిజలింగప్ప నివాసం



నిజలింగప్ప నివాసం కోసం రూ.4కోట్లు

బెంగళూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఎస్ నిజలింగప్ప నివాసాన్ని ప్రభుత్వం సంరక్షించేందుకు సిద్ధమైంది. రూ.4.18 కోట్ల గ్రాంటును జిల్లా అధికారికి విడుదల చేశారు. 2020-21 బడ్జెట్‌లో చిత్రదుర్గలోని నిజలింగప్ప నివాసాన్ని కొనుగోలు చేసి సంరక్షించి అభివృద్ధి చేసేందుకు రూ.5కోట్లు కేటాయించారు. పాలనాపరమైన అనుమతులు ఇచ్చి రూ.4.18 కోట్లు బుధవారం విడుదల చేశారు. ఇటీవల సదరు నివాసాన్ని విక్రయించాలనే అంశం ప్రచారం కావడంతో ప్రభుత్వం స్పందించింది. రూ.4.18 కోట్లు నిజలింగప్ప మనవడు వినయ్‌కు చెల్లించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోదలిచింది. నిజలింగప్ప 2000 సంవత్సరం ఆగస్టులో దివంగతులు కాగా సదరు ఇల్లు ఆయన వారసులనుంచి సంపూర్ణ హక్కులు ప్రస్తుతం మనవడు వినయ్‌కు చెల్లుబాటుగా ఉన్నాయి.



నిజలింగప్ప(ఫైల్)


కేంద్ర ప్రభుత్వ సర్వీసులకు ఐఏఎస్ అధికారి శిఖా

బెంగళూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కేడర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సి.శిఖా కేంద్ర సర్వీసులకు బదిలీ అయ్యారు. కేంద్ర పౌర ఆహార సరఫరాల శాఖ జాయింట్ కార్యదర్శిగా వెళ్ళనున్నారు. త్వరలోనే ఢిల్లీలో బాధ్యతలు చేపట్టనున్నారు. 2004 కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారిగా శిఖా సుదీర్ఘకాలం పాటు మైసూరు జిల్లాధికారిగా వ్యవహరించారు. సెస్కాం, బెస్కాం, బీఎంటీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గాను, పీయూ బోర్డు డైరెక్టర్‌గా కొనసాగారు. ప్రస్తుతం వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శిఖా కేంద్ర ప్రభుత్వ సర్వీసులకు వెళుతున్న తరుణంలో ఆమె భర్త ఐఏఎస్ అధికారి అజయ్ నాగభూషణ్ కూడా కేంద్ర సర్వీసులకు వెళ్లే అవకాశం ఉంది.



కృషి మేళాలో పెర్‌ఫెక్ట్ స్టాల్‌ను సందర్శించండి

బెంగళూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని జీకేవీకేలో కృషిమేళాలో ఏర్పాటవుతున్న గ్లోబల్‌గ్రీన్ అగ్రిసేవా సంస్థవారి పెర్‌ఫెక్ట్ బ్రాండ్ స్టాల్‌ను సందర్శించాలని సంస్థ అధినేత బి.ఎస్.మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వృక్ష ఆయుర్వేదం ద్వారా రూపొందించిన పెర్‌ఫెక్ట్ మందు వాడకం ద్వారా పంటలలో అన్నిరకాల ఆకుముడత వైరస్‌లను, ఇతర రోగాలను నివారించవచ్చునన్నారు. కృషిమేళాలో అగ్రిఇన్‌పుట్స్ విభాగంలో స్టాల్‌నెంబరు 92ను సందర్శించాలన్నారు. పెర్‌ఫెక్ట్ మందు సాధారణ రైతులకే కాకుండా పెరటితోటల పెంపకందారులకు కూడా చక్కగా దోహదపడుతుందన్నారు. మేళా గురువారం నుంచి నాలుగురోజులపాటు కొనసాగుతుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పెర్‌ఫెక్ట్ ప్యాకెట్

న్యూస్‌బాక్స్

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నియంత్రణకు శబరిమలకు గుంతకల్లు డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. కాచిగూడ-కొట్టాయం-కాచిగూడ (వయా గుత్తి) ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాచిగూడ-కొట్టాయం (నం. 07133) రైలు ఈ నెల 14, 21, 28 తేదీల్లో కాచిగూడలో మధ్యాహ్నం 3-40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 6-50 గంటలకు కొట్టాయం చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07134) ఈ నెల 15, 22, 29 తేదీల్లో కొట్టాయంలో రాత్రి ఎనిమిదిన్నరకు బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 11-40 గంటలకు కాచిగూడకు చేరుతుందన్నారు. అలాగే హైదరాబాదు-కొట్టాయం (నం. 07135) రైలు (వయా గుంతకల్లు) ఈ నెల 19, 26 తేదీల్లో మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాదులో బయలుదేరి, మరుటిరోజు మధ్యాహ్నం 4-10 గంటలకు కొట్టాయం చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07136) ఈ నెల 20, 27 తేదీల్లో కొట్టాయంలో సాయంత్రం 6-10 గంటలకు బయలుదేరి మరుటిరోజు రాత్రి 11-45 గంటలకు హైదరాబాదుకు చేరుతుందన్నారు. నాందేడ్-కొల్లాం (నం 07139) ప్రత్యేక రైలు (వయా గుంతకల్లు) ఈ నెల 16న నాందేడ్‌లో ఉదయం 8-20 గంటలకు బయుదేరి మరుసటి రోజు రాత్రి పదిన్నరకు కొల్లాం చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07140) ఈనెల 18న కొల్లాంలో తెల్లవారుజాము రెండున్నరకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12 గంటలకు నాందేడ్‌కు చేరుతుందన్నారు. మౌలాలి-కొల్లాం ప్రత్యేక రైలు (నం. 07141) (వయా గుంతకల్లు) ఈనెల 23, 30 తేదీల్లో మౌలాలిలో మధ్యాహ్నం 2-45 గంటలకు బయలుదేరి, మరుసటిరోజు రాత్రి పదిన్నరకు కొల్లాం చేరుతుందన్నారు. దీని తిరుగుప్రయాణపు రైలు (నం. 07142) ఈ నెల 25, డిసెంబరు 2న కొల్లాంలో తెల్లవారుజాము రెండున్నరకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1 గంటకు మౌలాలికి చేరుతుందని వివరించారు.

గుత్తిలో చిరుత సంచారం



ఇదే.. ఆ చిరుత అంటున్నారు..

గుత్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని కర్నూలు రోడ్డు మోడల్ స్కూల్ సమీపంలోని గుట్టలో మంగళవారం చిరుత సంచరించినట్లు వదంతులు వ్యాపించాయి. చిరుత సంచరిస్తోందని స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫారెస్ట్ అధికారులు కొండ గుట్టలలో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే బుధవారం కూడా చిరుత కనిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో గుట్టలకు సమీపంలో ఉన్న కేపీఎస్ కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. అయితే చిరుత సంచారం వాస్తవం కాదని, పుకార్లు నమ్మవద్దని అటవీ శాఖ అధికారి మధుబాబు తెలిపారు. కొండ గట్లల్లో చిరుత సంచరించినట్లు ఎలాంటి ఆనవాలు కనిపించలేదన్నారు.

బోధనేతర పనుల నుంచి మినహాయించాలి

- ఏపీటీఎఫ్ నాయకులు



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్

అనంతపురం విద్య, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోధనేతల పనుల నుంచి టీచర్లను మినహాయించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయభవన్‌లో ఆ సంఘం నాయకులు బుధవారం సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ అనేక యాప్‌ల వల్ల టీచర్లపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. త్వరలో ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. చాలా స్కూళ్లలో సిలబస్ ఇంకా పూర్తి చేయలేని దుస్థితి ఉందన్నారు. మరోవైపు అపార్ ఐడీల జనరేషన్ అంటూ ఇంకో సమస్య తీసుకొచ్చి టీచర్లపై పెట్టారన్నారు. ఇలా అనేక బోధనేతర పనుల వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందిపడే పరిస్థితులు ఉన్నాయన్నారు. 12వ పీఆర్సీని సకాలంలో అమలు చేయాలన్నారు. తక్షణం మధ్యంతర భృతి 30 శాతం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సతీష్, సర్దార్‌వలి, రమణ, వన్నప్ప, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, తిప్పేస్వామి, మహేష్, హిమగిరి, సుహేల్, రంగనాయకుడు, బాబ్జాన్, అలీ, అబ్దుల్ రజాక్, కలీముల్లా, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

మరో ప్రపంచం



అదేమీ పారిపోదు..!
అందులో ఉన్నదీ
మాయమైపోదు..!
అయినా ఎందుకో..
ఆత్రం..!
నడుస్తున్నా..
పడుకున్నా..
కూర్చున్నా..
చూపులన్నీ దానిపైనే..!
అర్థం చేసుకోండి..
ఇది అనర్థానికి దారితీస్తుంది..!

(అనంతపురం కలెక్టరేట్ సమీపంలో బుధవారం..)

చమత్కారాల కవికాకి

ఉపాధ్యాయుడిగా ఆటపాటలతో విద్యాబోధన

కవిగా ఆర్ద్రతతో రచనలు

నేడు కవి జై సీతారాం శతజయంతి





బహుమతి అందుకున్న జైసీతారాం చిత్రించిన కార్టూన్

పెనుకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆట, పాటలతో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తూ, కవిగా కలకాలం నిలిచే రచనలు చేశారు జై సీతారాం(కవి కాకి). చదువు చెప్పడమంటే పిల్లల్ని కొట్టడమనే అర్థం ఉన్న రోజుల్లో ప్రాథమిక ఉపాధ్యాయుడుగా తన సృజనాత్మకతతో ఆట, పాటల ద్వారా సులువుగా పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థం అయ్యేలా బోధించారు. జై సీతారాం శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండల కోగిర గ్రామంలో 1924 నవంబరు 14న ఓ నిరుపేద కుటుంబంలో జన్మించారు. స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. కుటుంబ పరిస్థితుల కారణంగా మేకల కాపరిగా పనిచేశారు. అయితే చదువుకోవాలనే కోరిక తీవ్రమై పెనుకొండకు పారిపోయి అష్టకష్టాలు పడి 8వ తరగతి వరకు చదివారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డారు.

ఆటపాటలతో బోధన

పిల్లలకెప్పుడూ వేడుక, వినోదం కావాలి, అందుకు అభినయంతో కూడిన పాటలు కావాలి. భాషే మానసిక వికాసానికి మూలమని నమ్మి పాటలు రాయడమూ, పాడటాన్ని జై సీతారాం ప్రవృత్తిగా స్వీకరించారు. అలాగే చిట్టి పొట్టి పదాలతో ఎన్నో కవితా చమత్కారాలు చేశారు. ఆయన రాసిన వందలాది బాలగేయాలు రుషి వ్యాలీ ద్వారా, వెన్నెల విందు బాలసాహిత్య అకాడమీ ద్వారా ప్రచురణ పొందాయి. పిల్లలకు భాష నేర్పడం కోసం ఆయన నిత్యం పరిశోధకులుగా సున్నా వాచకం, పది అక్షరాలతో తెలుగు లిపిలాంటి ప్రయోగాలు ఎన్నో చేశారు. పాఠాలను పాటలుగా నేర్పి పిల్లలకు చదువంటే కష్టం కాకుండా ఇష్టపడేలా చేసేవారు.

అలరించిన రచనలు

పిల్లలనే కాక నిట్టూర్పులు, మదాంధ భారతం, సమతా చతుశృతి, రమ్‌సీసాలు లాంటి చందోబద్ధ రచనలతో సాహిత్యాభిమానులను ఎంతగానో అలరించారు. జై సీతారాం హృదయం పేదలు, స్త్రీలు, శ్రమజీవులు, దేశం పట్ల ఆర్ద్రంగా స్పందించేది. చెమట నీది, చేయి నీది, చేతిలోని చెమ్మనీది, మడక నీది, మానునీది, కాడిమేడి నీదిరా, కాడిమేడి పండించిన కడుపు కూడు ఏమాయెరా ? అంటూ రైతన్న బాధలను కవితాగానం చేశారు. కట్నాల వికృత స్వరూపాలపై సామాజిక రుగ్మతలపై కలం కత్తి దూశారు. ఎమర్జెన్సీలో జైలు శిక్ష అనుభవించారు. జైల్లో కూడా అరసం, విరసం, దిగంబర కవులతో జరిగిన సాహిత్య గోష్ఠులతో తన కలానికి పదును పెంచుకున్నారు. ఇంటికన్నా పదిలం ఇది రమ్మ జైలు అంటూ చమత్కార కవితాగానాలు వినిపించారు. 1983లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఎన్నో సత్కారాలు, అవార్డులు అందుకున్నారు. కవిగానే కాక చిత్రకారుడిగా తాను రాసిన బాలల సాహిత్యం, పాటలు, పద్యాల కోసం ఆయనే స్వయంగా పెన్సిల్‌తో బొమ్మలు గీశారు. ఇంతటి అద్భుత ప్రతిభాశాలి 9 అక్టోబరు 2000లో మృతి చెందారు.

నేడు శత జయంతి వేడుకలు

జై సీతారాం శత జయంతి వేడుకలను ఆయన స్వగ్రామమైన కోగిరలో నిర్వహించనున్నారు. గ్రామంలోని జడ్పీ హైస్కూల్ నందు కవికాకి కోగిర జైసీతారాం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కోగిర జయచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రజాకవి ఏలూరి ఎంగన్న, సడ్లపల్లి చిదంబర్‌రెడ్డి, డా.గోపీనాథ్, కోనాపురం ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, జాబిలి చాంద్ బాషా హాజరవుతారన్నారు.

వివాదాస్పదంగా వీఏఏల ఉద్యోగోన్నతి

అన్యాయం చేశారంటూ ఎస్సీ కేటగిరి సిబ్బంది ఆందోళన

అనంతపురం అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ (వీఏఏ)ల ఉద్యోగోన్నతి వివాదాస్పదంగా మారింది. ఉద్యోగోన్నతిలో తమకు అన్యాయం చేశారంటూ ఎస్సీ కేటగిరికి చెందిన సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. దీనిపై వారంతా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం యంత్రాంగం తర్జనభర్జనలో పడినట్లు సమాచారం. ఇదివరకే 16 మంది వీఏఏలకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాము నిబంధనల మేరకే ఉద్యోగోన్నతులు ఇచ్చామని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. అయితే తమకు జరిగిన అన్యాయంపై కోర్టుకు వెళతామని ఎస్సీ కేటగిరి సిబ్బంది స్పష్టం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖలో 139 మంది వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓలు) పనిచేస్తున్నారు. ఇందులో 24 మంది గ్రేడ్ -1, 115 మంది గ్రేడ్ - 2 కింద విధులు నిర్వర్తిస్తున్నారు. మరో 26 ఏఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఇందులో 60 శాతం సీనియార్టీ, రోస్టర్ వారిగా ఉద్యోగోన్నతులు కల్పించా లని, మిగిలిన 40 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఖాళీ పోస్టుల్లో 60 శాతం ఉంటే 16 మంది వీఏఏలకు ఉద్యోగోన్నతి కల్పించే ప్రక్రియ చేపట్టారు. సదరు 16 పోస్టుల్లో 3 పోస్టులు ఎస్సీ కేటగిరిలకు కేటాయించాలన్న నిబంధనల ఉన్నట్లు, 2, 7, 16 నెంబర్ల కింద తమకు పోస్టులు కేటాయించకుండా అన్యాయం చేశారని ఎస్సీ కేటగిరి సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఎస్సీ కేటగిరిలకు బదులుగా ఇతర వర్గాల వారికి ఉద్యోగోన్నతి కల్పించారని వాపోతున్నారు. ఇదేమని సంబంధిత అధికారులను అడిగితే ఇదివరకే పనిచేస్తున్న ఏఈఓల్లో 24 మంది ఎస్సీ కేటగిరిల ఉద్యోగులు ఉన్నందున 17 శాతం కోటా ఇప్పటికే పూర్తైందని సమాధానం ఇచ్చారని బాధిత సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇదివరకే పనిచేసే ఏఈఓల జాబితాతో తమకు సంబంధం లేదని, వీఏఏల నుంచి ఏఈఓల ఉద్యోగోన్నతిలో తమ కోటా మేరకు పోస్టులు కేటాయించాలని కోరుతున్నారు. గతంలో ఇష్టారాజ్యంగా రోస్టర్ పాటించడం ద్వారా తమకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు.

మహిళా ఉద్యోగుల బాధ్యత యాజమాన్యానిదే

పోష్ చట్టంపై అవగాహన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మహిళలు పనిచేసే చోట ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత యాజమాన్యాలపైనే ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సివిల్ కోర్టు న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ అన్నారు. కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక(పోష్)చట్టం-2013పై న్యాయసేవాసదన్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎల్ఎస్ఏ కార్యదర్శి, శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు హాజరయ్యారు. న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ మహిళలపై తోటి ఉద్యోగులు, వారి పైఅధికారులు అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు తాము చేసే ఉద్యోగానికే పరిమితం కాకుండా లోకజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రజాసేవలందించే సంస్థల నుంచి ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించుకోవడానికి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. విద్య,వైద్యం, బీమా, బ్యాంకింగ్, రవాణా, తాగునీరు, శానిటేషన్, గృహనిర్మాణం, జాతీయ ఉపాధి హామీ, టెలికాం సేవలు వంటి ప్రజా ప్రయోజన సేవల సమస్యలలో రూ.కోటి దాకా పరిహారం ఎలాంటి ఖర్చు లేకుండా పొందే అవకా శం ఉందన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కార్యాలయాల్లో అంతరంగిక ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చేయాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో షి-బాక్సు వినియోగించి ఫిర్యాదులు చేయవచ్చని, 90రోజుల్లో పరిష్కారం లభిస్తుందన్నారు. మహిళలు అపత్కాలంలో 181 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరికృష్ణ, పద్మజ, వన్‌స్టాప్ సెంటర్ సఖి మేనేజర్ శాంతామణి, గృహహింస నిరోధక చట్టం సోషల్ కౌన్సిలర్ ఉమాదేవి, లీగల్ కౌన్సిలర్ నర్మద, విద్యాశాఖ తరఫున శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మత్తులో మునిగాడా..?

హెచ్చెల్సీలో తేలిన మృతదేహం

స్నేహితులతో కలిసి మద్యపానం

కాలువ దాటుతూ.. కనుమరుగు

అనంతపురం క్రైం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బుడ్డప్పనగర్‌కు చెందిన ధనుంజయ(33) మృతదేహం బుధవారం హెచ్చెల్సీ నీటిలో తేలింది. అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని పావురాల గుట్ట సమీపంలో అతని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ధనుంజయ మంగళవారం సాయంత్రం హెచ్చెల్సీ నీటిలో గల్లంతయ్యాడు. మృతుడు సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారం చేసేవాడు. స్నేహితులు అస్లామ్, హర్షవర్ధన్, రియాజ్‌తో కలిసి మంగళవారం ఉదయం 11గంటలకు ద్విచక్ర వాహనాల్లో బయటకు వెళ్లాడు. అందరూ కలిసి వడియంపేట సమీపంలో మద్యం సేవించారు. పావురాల గుట్ట సమీపంలోని హెచ్చెల్సీ వద్ద బ్రిడ్జిపై కూర్చుని మధ్యాహ్నం 3 గంటల సమయంలో మరోసారి మద్యం సేవించారు. నగరంలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న తన భార్యను ఇంటి వద్ద డ్రాప్ చేసి వస్తానని సాయంత్రం 5 గంటల సమయంలో అస్లాం వెళ్లిపోయాడు. మిగిలిన ముగ్గురూ అక్కడే ఉండిపోయారు. కాసేపటికి ధనుంజయ కాలువలోకి దిగి.. అవతలి గట్టుకు చేరుకున్నాడు. తిరిగి ఇటువైపు వచ్చే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో నీటి వేగానికి మునిగిపోయాడు. ఈ విషయాన్ని అతని స్నేహితులు పోలీసులకు తెలియజేశారు. నాలుగో పట్టణ ఎస్ఐ రాంప్రసాద్ సిబ్బందితో కలిసి వెళ్లి గాలించారు. ధనుంజయ మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. ధనుంజయ కుటుంబ సభ్యులు అతని స్నేహితులపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భార్య భువనేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతికి కారణమేమిటో తెలుస్తుందని పోలీసులు చెబుతున్నారు. ధనుంజయకు కూతురు భవిష్య, కుమారుడు కౌశిక్ ఉన్నారు.

పోసానిపై ఎస్పీకి ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న తెలుగు యువత నాయకులు

అనంతపురం అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పోసాని కృష్ణమూరళీపై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత నాయకులు ఎస్పీ జగదీష్‌ను కోరారు. తెలుగు యువత నాయకులు లక్ష్మీనరసింహ, నాగభూషణం, నాగరాజు, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు బండి పరశురాం బుధవారం డీపీఓలో ఎస్పీని కలిశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన పోసానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హెచ్చెల్సీ మరమ్మతుల కోసం జోలె పడతా

- జేసీ ప్రభాకర్ రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

నార్పల/పుట్లూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పుట్లూరు నుంచి తుంపెర డీప్‌కట్ వరకు ఉన్న హెచ్చెల్సీ మరమ్మతులకు అవసరమైన డబ్బులను జోలె పట్టి సేకరిస్తానని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. పుట్లూరు నుంచి తుంపెర డీప్ కట్‌వరకూ ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మన రాష్ట్రంలో యువతకు వ్యవసాయమే ప్రధాన ఆధారంగా మారబోతోందన్నారు. సాగు, తాగు నీరు లేకుంటే జన జీవనం కష్టం అవుతుందన్నారు. డీప్ కట్ గేట్ మరమ్మతుల కోసం రూ.మూడు లక్షలు ఖర్చు అవుతుందని, దీన్ని భరించడానికి ఏ రైతు ముందుకు రావటం లేదన్నారు. పంజాబ్ రాష్ట్రంలో రైతులు కాలువ మరమ్మతులు సొంత డబ్బులతో చేసుకుంటారని, అలాగే ఇక్కడ మన రైతులు చేసుకోవాలన్నారు. నీరు తగ్గిన తరువాత కాలువ మరమ్మతుల కోసం ప్రతి రైతు వద్దకు జోలె పట్టుకుని వస్తానన్నారు. తెలంగాణలో మహి ళలు కోళ్ల ఫారాలు పెట్టుకొని డబ్బులు సంపాదిస్తున్నారని మనరాష్ట్రంలో కూడా మహిళలు కోళ్లను పెంచుకోని ఆదాయ వనరులు పెంచుకోవాలన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

అనంతపురం విద్య, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ఈ నెల 20 వరకూ నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతోపాటు, ఉమ్మడి జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 14న బాలల దినోత్సవం, ప్రారంభ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, పుస్తక పఠనప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖుల స్మరణ, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు, 18న విద్యార్థులకు పలు రకాల పోటీలు, 19న మహిళలకు పోటీలు, 20న డిజిటల్ లైబ్రరీపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని ఆమె తెలిపారు.

కరువు మండలాల్లో పంట నష్టంపై సర్వే

అనంతపురం అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో కరువు ప్రాంతాలుగా ప్రకటించిన ఏడు మండలాల్లో పంటనష్టంపై సర్వే చేయాలని ప్రభుత్వం నుంచి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయా నికి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలోని నార్పల, అనంతపురం, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాల్లో రైతుల వారిగా పంటనష్టం వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఈనెల 19లోగా పంటనష్టం వివరాలు నమోదు చేయాలని, 20 నుంచి 25 వరకు రైతు సేవా కేంద్రాల్లో పంటనష్టం వివరాలతో కూడిన జాబితాలు ప్రదర్శించాలని ఆదేశించారు. ఆ జాబితాపై రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, వాటినిపై విచారించి, ఈనెల 28 పంటనష్టం జాబితాను విడుదల చేయనున్నారు. కరువు మండలాల్లో పంటనష్టపోయిన రైతులకు పరిహారం అందజేస్తారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 2 హెక్టార్ల వరకు ఇన్‌పుట్ సబ్సిడీ వర్తింపజేస్తారు. హెక్టారుకు వేరుశనగ, పత్తి రూ.17వేలు, మొక్కజొన్న రూ.12500, కంది, మినుము, పెసర, ఉలవ పంటలకు రూ.10వేలు, జొన్న, సజ్జ, రాగి, ఆముదం, కొర్ర రూ.8500లు పంట నష్టపరిహారాన్ని వర్తింపజేయనున్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు కరువు మండలాల్లో పంటనష్టం వివరాలు సేకరించాలని అధికారులను జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు.

స్కూళ్లలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కలెక్టర్‌కు ఏపీఎస్ఈఏ నాయకుడి వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న విజయ్ భాస్కర్

అనంతపురం విద్య, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అపార్ జనరేషన్ కోసం స్కూళ్లలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్ భాస్కర్ కలెక్టర్‌ను కోరారు. ఈమేరకు ఆయన బుధవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా విద్యార్థులందరికీ అపార్ అమలు చేస్తున్నారన్నారు. అయితే అపార్ నమోదుకు విద్యార్థి పాఠశాల రికార్డులు, యూ-డైస్ వివరాలు ఒకే రకంగా ఉన్నప్పటికీ ఆధార్ కార్డులో మరోరకంగా ఉండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ఆధార్‌లో మార్పుల కోసం గ్రామాల్లో తగినన్ని కేంద్రాలు లేకపోవడం వల్ల తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారన్నారు. స్కూళ్లలో 60 శాతం మంది విద్యార్థుల ఆధార్ కార్డులు సరిగ్గా లేవన్నారు. ఈ సమస్య పరిష్కారానికి స్కూళ్లలో ఆధార్ క్యాంపులు పెట్టాలని కోరారు.

జాతీయ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులతో డీఈఓ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ సాఫ్ట్ టెన్నిస్‌పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల పులివెందులలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారుల్లో జ్ఞానేశ్వర్‌రెడ్డి, సంహిత, కిరణ్మయి ఉన్నారు. వీరు డిసెంబరులో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి సాఫ్ట్‌టెన్నిస్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను డీఈఓ ప్రసాద్‌బాబు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, ఏడీ నాగరాజు అభినందించారు.

ఉద్యోగాలకు 57మంది ఎంపిక




ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

అనంతపురం క్లాక్‌టవర్/రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రామ్‌నగర్‌లోని నలంద డిగ్రీ కాలేజీలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈమేళాలలో యాక్సిస్‌బ్యాంకు 16మంది, సీఎస్ఆర్ అసోసియేట్స్ 18, జారికార్ట్ కంపెనీ 5, ఐఐఎఫ్ఎల్ 11, క్రెడిట్ యాక్సెస్ గ్రోమోర్‌కు ఏడుగురు మొత్తం 57మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి, నలంద కళాశాల యాజమాన్యం కేబీ చౌదరి, భువనేశ్వర్‌ప్రసాద్ సీడాప్ నారాయణస్వామి నియామకపత్రాలు అందజేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.కే. శంకరనారాయణ కాంచ్...

జవహర్‌లాల్ నెహ్రూ (జయంతి)



దేశ తొలి ప్రధానమంత్రి, 'భారత రత్న' గ్రహీత జవహర్‌లాల్ నెహ్రూ 1889 నవంబరు 14న అలహాబాద్ (ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్)లో జన్మించారు. ప్రధానిగా ఎన్నికై 18ఏళ్లపాటు కొనసాగారు. స్వాతంత్ర్య సమర యోధుడు, రచయిత కూడా. పండిట్ నెహ్రూగా, చాచా నెహ్రూగా పేరొందారు. రచయిత, చరిత్ర కారుడు కూడా. స్ఫూర్తిదాయక రచనలు చేశారు. దేశ అభివృద్ధికి ఎన్నో సంక్షేమాలు అమలు చేశారు. జాతీయస్థాయి విద్యావిధానం అమలుచేసి మారుమూల పల్లెలకు సైతం విద్య అందేలా చేశారు. కాగా కాంగ్రెస్ పార్టీకి ఆయనో సింబల్‌గా మారారనడంలో అతిశయోక్తి లేదు. ఆయన పుట్టినరోజును 'బాలల దినోత్సవం'గా ఆచరిస్తారు. 1964 మే 27న కన్నుమూశారు.

నేతి శ్రీరామశర్మ (జయంతి)



నేతి శ్రీరామశర్మ 1928 నవంబరు 14న కృష్ణా జిల్లా విశాఖపట్నంలో జన్మించారు. సంగీత విద్వాంసుడు. విజయవాడలో గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వద్ద వయొలిన్, గాత్రసంగీతాన్ని గురుకుల పద్ధతిలో నేర్చుకున్నారు. 'ఆకాశవాణి' నిలయ విద్వాంసులుగా విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్‌లలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. వందలాది మందికి గురుకుల విధానంలో బోధనలు చేశారు. రేడియో ద్వారా సైతం సంగీత పాఠాలు నిర్వహించారు. శిష్యులు ఆత్మీయంగా 'సంగీతానంద' బిరుదుతో సత్కరించారు. 2012 మే 2న కన్నుమూశారు.

శ్రీల ప్రభుపాద (వర్ధంతి)



అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) సంస్థాపకుడు అభయ చరణారవింద భక్తి వేదాంత స్వామిగా పేరొందిన శ్రీల ప్రభుపాద 1896 సెప్టెంబరు 1న కోల్కత్తాలో జన్మించారు. ఆధ్యాత్మికవేత్త. 'హరే కృష్ణ' ఉద్యమంతో ప్రజలలో భక్తి భావాలు పెంపొందించారు. శ్రీమద్భాగవత ములోని 18వేల శ్లోకాలను అనువాదము, వ్యాఖ్యానాలతో కూడిన అనేక సంపుటాలను రచించారు. 1977 నవంబరు 14న పరమపదించారు.

గీతా సుబ్బారావు (పుట్టినరోజు)



'గీతా' సుబ్బారావు 1942 నవంబరు 14న విజయనగరంలో జన్మించారు. అసలు పేరు పిళ్ళా సుబ్బారావు. గీతా సుబ్బారావుగానే పేరొందారు. రచయిత, కార్టూనిస్టు. దాదాపు మూడు దశాబ్దాలపాటు గీతా పేరుతో కార్టూన్‌లు గీశారు. సినిమావాళ్ళందరికీ పబ్లిసిటీ కింగ్‌గా కూడా ఆయన ఆత్మీయుడు. సెన్సార్ బోర్డు సలహా మండలి సభ్యుడు. తెలుగులో తొలి ప్యాకెట్ డైలీ కార్టూన్‌లు వేసిన క్రెడిట్ బహుశా ఆయనకే దక్కుతుంది. బాల సాహిత్య రచయిత, తదితర గౌరవాలు పొందారు. ఈయన రచనలు పలు భాషల్లోకి కూడా తర్జుమా కాగా కొన్ని సినిమాలుగా విడుదలయ్యాయి.

యండమూరి వీరేంద్రనాథ్ (పుట్టినరోజు)



ప్రముఖ రచయితగానే కాక వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా పేరొందిన యండమూరి వీరేంద్రనాథ్ 1948 నవంబరు 14న తూర్పు గోదావరి జిల్లా రాజోలులో జన్మించారు. తెలుగులో సుప్రసిద్ధ నవలా రచయిత. ఆయన రాసిన నవలలు కొన్ని సినిమాలుగా కూడా వచ్చాయి. వృత్తిరీత్యా చార్టెర్డ్ అకౌంటెంట్. పదేళ్లపాటు ఆంధ్రాబ్యాంకు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ విభాగాధిపతిగా పనిచేవారు. పూర్తిస్థాయి రచయితకోసం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆయన నవలలు ఎంతోమందిని ప్రభావితం చేశాయనడంలో అతిశయోక్తి లేదు. 35 నవలలు, వందలాది బాలల రచనలు చేశారు. సాహిత్య అకాడమీ, నంది అవార్డులు పొందారు.

ప్రిన్స్ ఛార్లెస్ (పుట్టినరోజు)



ప్రిన్స్ ఛార్లెస్-3 లండన్ దేశంలోని బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో 1948 నవంబరు 14న జన్మించారు. కింగ్ జార్జ్ 4, రాణి ఎలిజబెత్‌ల తొలి మనవడు. 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్'గా సుదీర్ఘకాలం కొనసాగారు. పర్యావరణంపైనా, సేంద్రీయ సాగుపై ప్రజలలో జాగృతి కల్పించారు. హోమియోపతి వైద్య విధానానికి తన వంతు మద్దతు తెలిపారు. రచయితగా, సహరచయితగా పలు పుస్తకాలు రాశారు. 1976లో ట్రస్టు ఏర్పాటు చేసి సామాజికసేవలు కొనసాగిస్తున్నారు. ప్రిన్స్ విలియం, హారీలు ఆయన మాజీ భార్య డయానా కుమారులు.

సోఫియా కెనిన్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన టెన్నిస్ క్రీడాకారిణి సోఫియా అన్నా కెనిన్ 1998 నవంబరు 14న జన్మించారు. నిక్ నేమ్ సోన్యా. డబ్ల్యూటీఏలో నాల్గవ ర్యాంకుగా నిలిచారు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సాధించారు. వింబుల్డన్ పోటీల్లోనూ పాల్గొని ప్రతిభ కనబరిచారు. వరల్డ్ టెన్నిస్ టీమ్ పోటీలలోనూ పాల్గొన్నారు. ఫిలడెల్ఫియా జట్టు ముందంజలో సాగేందుకు తనవంతు సహకారం అందించారు. చైనా ఓపెన్ 2023లోనూ సత్తా చాటారు. 5 డబ్ల్యూటీఏ సింగిల్స్ టైటిల్స్, రెండు డబ్ల్యూటీఏ డబుల్స్ టైటిల్స్ సాధించారు. 2024 ఆగస్టులో డబుల్స్ ర్యాంకింగ్‌లో 26వ స్థానంలో నిలిచారు.

తగ్గిన టమోట ధరలు

అనంతపురంరూరల్,నవంబరు13(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 1275 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.15, కనిష్ఠ ధర రూ.10పలికినట్లు ఆయన తెలిపారు.

బీబీఎంపీ చెత్తలారీల అడ్డగింపు

▸▸ గ్రామస్థుల రాస్తారోకో

దొడ్డబళ్ళాపుర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టోల్ పన్నును తప్పించుకునేందుకు బీబీఎంపీ చెత్త లారీలు రూటు మార్చాయి. బృహత్‌బెంగళూరు మహానగ పాలికె పరిధిలో సేకరించిన చెత్తను దొడ్డబళ్ళాపుర తాలూకాలో డంపింగ్ చేస్తారు. అయితే టోల్ పన్నును తప్పించుకునే ఉద్దేశ్యంతో లారీలు రూటు మార్చి పల్లెలమీదుగా సంచరిస్తున్నాయి. నిత్యం 50కుపైగా చెత్తలారీలు ఒక్కసారిగా వస్తుండడంతో గ్రామీణ రోడ్లు దెబ్బతింటున్నాయని, స్థానికంగా దుర్వాసన భరించలేకపోతున్నామంటూ తాలూకా శివారులోని కొడిగేహళ్ళి జంక్షన్ వద్ద చుట్టుపక్కల గ్రామస్తులు బుధవారం ఒక్కసారిగా లారీలను అడ్డగించి రాస్తారోకో నిర్వహించారు. గ్రామాల మీదుగా అక్రమంగా వెళ్తున్న చెత్త లారీలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.



రాస్తారోకోతో ఆగిన వాహనాలు



నిరసనలో గ్రామస్తులు

ఘన వ్యర్థాలను గ్రేడింగ్ చేసేందుకు ఎంఎస్‌జిపి కేంద్రం వద్ద బీబీఎంపీ చెత్త పడేస్తోంది. నగరసభ సభ్యుడు వెంకటేశ్ మాట్లాడుతూ నిత్యం భారీ ప్రమాణంలో చెత్తను పడేస్తుండడంతో చుట్టుపక్కల ప్రాంతాలలో దుర్గంధం నెలకొందని వెంటనే ఎంఎస్‌జిపి కేంద్రాలను మూసివేయాలని ఆక్రోశం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు ప్రభుత్వానికి విన్నవించారని, శాసనసభలోనూ ప్రస్తావించారన్నారు. కొన్ని బీబీఎంపీ చెత్త లారీలకు పర్మిట్ లేకుండా యలహంక మార్గంలో దొడ్డబళ్ళాపురకు వస్తున్నాయన్నారు. ప్రతిరోజూ 50కుపైగా లారీల ద్వారా దొడ్డబళ్ళాపుర తాలూకాలో చెత్తను డంపింగ్ చేస్తున్నారన్నారు. చెత్తను తరలించే లారీల వల్ల గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయని, కొన్ని చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే ఈ వాహనాలను సీజ్ చేయాలన్నారు. నిరసనలో గ్రామ పంచాయతీ సభ్యుడు మాట్లాడుతూ టోల్‌పన్నును తప్పించుకునేందుకు అడ్డదారిలో వాహనాలు వస్తున్నాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లారీలను గ్రామం లోకి అనుమతించేది లేదన్నారు.

ప్రదర్శనలతో విద్యార్థులలో చైతన్యం

బంగారపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సరిహద్దు ప్రాంతాలలోని పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించేలా గణిత, సైన్స్ వస్తు ప్రదర్శనను ఏర్పాటు చేయడం అభినందనీయమని బూదికోట గ్రామపంచాయతీ అధ్యక్షుడు మంజునాథ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని బూదికోట శ్రీరామకృష్ణ విద్యాసంస్థలో సైన్స్ అండ్ మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌ను బుధవారం లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. సరిహద్దు ప్రాంతాలలో గుణాత్మకతను పెంచేలా నారాయణశెట్టి నేతృత్వంలో ప్రైవేట్ పాఠశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పట్టణ విద్యార్థులకు ధీటుగా అన్ని రంగాలలో ప్రోత్సహించేలా ఉందన్నారు. రామకృష్ణ విద్యాసంస్థ వ్యవస్థాపకుడు నరేశ్ మాట్లాడుతూ వివిధ అంశాలపై తమ పాఠశాలలో కూడా ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని, కేవలం పాఠాలకే పరిమితం కాకుండా గణితం, సామాన్యశాస్త్రంలో ప్రోత్సహించేలా ప్రదర్శన నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థ అధ్యక్షుడు మహేశ్, కార్యదర్శి కలైవాణి, కీర్తి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ప్రముఖులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైన్స్, గణిత ప్రదర్శన ప్రారంభంలో ప్రముఖులు

సంబరంగా షావలి గంధోత్సవం

శిడ్లఘట్ట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జంగమకోటె దర్గాలో జిందా నసీరుద్దీన్‌షావలి సంస్మరణార్థం గంధోత్సవం, ఉరుసు, ఖవాలి కార్యక్రమంలో సంబరంగా సాగాయి. ముఖ్యఅతిథిగా సమాజ సేవకుడు ఆంజినప్ప పాల్గొన్నారు. ఖవాలి అజీంనాజ్ ముంబై బృందంచే పాటలు అలరించాయి. ఈ సందర్భంగా ఆంజినప్ప మాట్లాడుతూ దర్గా కమిటీ నిర్వాహకులు, యువతను అభినందించారు. స్థానికులు చూపిన అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నజీర్ అహ్మద్, గులాబ్ జాహన్, ఫైజుల్లా, గ్రామపంచాయతీ సభ్యుడు ఫైరోజన్, బాషా జమేదార్, ఇంజనీర్ బాబాసాహెబ్, మున్నాభాయ్ తదితరులు పాల్గొన్నారు.



ఖవాలిలో ప్రసంగిస్తున్న ఆంజినప్ప

బెయిల్ రద్దు చేయండి

బంగారపేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): దారుణంగా దాడికి పాల్పడి పది రోజుల్లోనే బెయిల్ పొంది గూండాయిజంతో వ్యవహరిస్తున్న వ్యక్తికి తహసీల్దారు వెంటనే బెయిల్ రద్దు చేయాలని అంబేడ్కర్ సేవా సమితి కర్ణాటక సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేఎం సందేశ్ డిమాండ్ చేశారు. తాలూకా కార్యాలయంలో తహసీల్దారుకు వినతిని సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాలూకాలోని యళేసంద్ర గ్రామంలో రాజశేఖర్, నేత్ర దంపతుల మధ్య కుటుంబ గొడవలు ఉన్నాయన్నారు. నేత్ర తల్లిదండ్రులు బెంగళూరులో ఉంటున్నారన్నారు. ఇటీవల రాజశేఖర్ కుటుంబీకులు తమ భూమిలో ఇల్లు నిర్మాణం సందర్భంగా నేత్ర కుటుంబీకులు దాడి చేశారని దీనిపై స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. భార్య తరపు కుటుంబీకులు ద్వేషంతో రాజశేఖర్‌ను హతమార్చే కుట్ర పన్నారన్నారు. గత నెల అర్ధరాత్రి వెంకటేశప్ప, కృష్ణ, విశ్వనాథ్, శ్రీనివాస్‌లు మరో కొంత మందితో కలసి దాడికి పాల్పడ్డారన్నారు. ఇంతటి ఘటనపై పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేశారో తెలియదని కేవలం పదిరోజుల్లోనే బెయిల్ పొంది దర్జాగా తిరుగుతున్నారన్నారు. వారు ఆసుపత్రికి వచ్చి తనను కూడా బెదరించారన్నారు. ఈమేరకు లిఖితపూర్వకంగా సమస్యను తహసీల్దారు దృష్టికి తెచ్చామన్నారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుపేంద్ర, కెసరనహళ్ళి యల్లప్ప, మునిరాజు, శంకర్, రవి, చిన్నబయ్యప్ప, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

మరణాలకు కారణమేంటి?

- కలకలం రేపిన బాలింతల మృతి
- గోషా ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ మూసివేత
- మరోచోట ఆపరేషన్లు


బళ్లారి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): బళ్లారి గోషా ఆస్పత్రిలో బాలింతల మృతికి కారణాలేంటన్న దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఆపరేషన్ థియేటర్‌లో ఇన్ఫెక్షన్ కావడమే కారణమన్న చర్చలు సాగుతున్నాయి. ఎలా ఇన్ఫెక్షన్ అయిందన్న దానిపై వైద్యవర్గాలు నోరు మెదపట్లేదు. ఆపరేషన్ థియేటర్‌ను మూసివేడయం ఈ అనుమానాలకు బలాన్నిస్తోంది. ఆపరేషన్ థియేటర్‌ను మరో చోటుకు మార్చారు. దీనిపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరాతీసినట్లు సమాచారం. బాలింతల మృతి, అస్వస్థతకు లోనవడంపై జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఆస్పత్రిలో ఆరాతీశారు.

● బళ్లారి జిల్లా ఆస్పత్రి (గోషా ఆస్పత్రి)లో ఇద్దరు బాలింతలు మృతిచెందగా.. మరో ఐదుగురు ప్రాణాపాయస్థితిలో వెంటిలేటర్‌పై ఉన్నారు. దీనికి కారణాలేంటని జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా.. ఆస్పత్రి సర్జన్ బసిరెడ్డిని అడిగారు. మంగళవారం రాత్రి 11 గంటల తరువాత జిల్లాధికారి.. విమ్స్ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై వైద్యం పొందుతున్న బాలింతలను పరిశీలించారు. విమ్స్ డైరెక్టర్ గంగాధర గౌడ, గోషా ఆసుపత్రి సర్జన్ బసిరెడ్డి ఉన్నారు. జిల్లా ఆసుపత్రికి ప్రసవం కోసం వచ్చిన గర్భిణులు కాన్పు తరువాత ఎందుకు మరణించారు? పొరబాటు ఎక్కడ జరిగింది..? ఆపరేషన్ థియేటర్ (ఓటీ)లో ఏం జరిగింది? థియేటర్‌లోనే సెప్టిక్ అయిందా..? కాన్పులుచేసే సమయంలో వాడే సామగ్రి సక్రమంగా వాడారా... అంటూ ప్రశ్నల వర్షం కురిపించారని సమాచారం. ప్రభుత్వ ఆసుపత్రి సర్జన్ మాత్రం జాండీస్ వచ్చి చనిపోయారని చెప్పుకొచ్చారు. అందుకు జిల్లా అధికారి మాట్లాడుతూ.. ఒకరు జాండీస్‌తో మృతి చెందారనుకుంటే.. మిగిలిన వారికి ఈ పరిస్థితి రావడానికి కారణం ఏమిటి గట్టిగా ప్రశ్నించారు. ఇప్పటికే బాలింతలు నందిని, లలిత మరణించారు. ప్రస్తుతం రోజా, సుమియాల పరిస్థితి విషమంగానే ఉంది. మిగిలిన ముగ్గురు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. ఇందుకు ఆపరేషన్ థియేటర్‌లో సమస్య కారణమా, వైద్యుల నిర్లక్ష్యమా అని డీసీ నిలదీశారు. బాలింతల మృతి విషయం బటయకు పొక్కడంతో సీఎం సిద్ధరామయ్య దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారు. ఈవిషయంపై సీఎం కూడా ఆరా తీస్తున్నారని తెలిసింది.

● గోషా ఆసుపత్రి కాన్పులకు ప్రత్యేకం. ఇక్కడికి కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు, విజయనగర, చిత్రదుర్గం జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్నూలు, ప్రాంతాల నుంచి ఇక్కడికి గర్భిణులు ప్రసవం కోసం వస్తుంటారు. పేద కుటుంబాలే ఇక్కడ కాన్పుకోసం వస్తుంటారు. అలాంటి పెద్దసుపత్రిలో ఇంత ఘోరం జరగడంతో గర్భిణులు, బాలింతలు ఆందోళన చెందుతున్నారు. ఆపరేషన్ థియేటర్‌లో ఏమి జరిగిందో తేల్చడానికి ల్యాబ్‌కు పంపించారని సమాచారం.

జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించాలి

బళ్లారి సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరోగ్యసంస్థల సహాయంతో స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు సూచించారు. బుధవారం జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో రక్తదాన శిబిరాల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణలో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని, వైద్యాధికారులు ప్రజలకు రక్తం ప్రాముఖ్యతను తెలియజేసి శిబిరాలను విజయవంతం చేయాలని సూచించారు. ఇటీవల దేవినగర్‌లోని బసవరాజేశ్వరి గ్రూప్ కళాశాలలో యాజమాన్యం సహకారంతో 72మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కురుగోడు పట్టణంలోని సంఘాలు, సంస్థల సహకారంతో ఈనెల 16న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెలలో సిరిగేరి గ్రామం నుంచి ప్రసవం కోసం విమ్స్‌లో చేరిన గర్భిణీకి 14పింట్ల రక్తాన్ని అందించినట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఇంద్రాణి తెలిపారు. ప్రదిరోజు ప్రమాదాల వల్ల గాయపడిన వారికి రక్తస్రావం ఎక్కువగా ఉన్నప్పుడు రక్తం ఎక్కువగా అవసరమని, 18ఏళ్ళు నిండిన ఆరోగ్యవంతులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈసందర్భంలో జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా,జిల్లా కమ్యూనికేబుల్ డీసీజ్ కంట్రోల్ అధికారి డా.మరియంబి, కుటుంబ సంక్షేమాధికారి డా.పూర్ణిమ కట్టిమణి, జిల్లా కుష్ఠువ్యాధి నిర్మూలన అధికారి డా.వీరేంద్రకుమార్, ఆర్‌సీహెచ్ అధికారి డా. హనుమంతప్ప,తాలూకా ఆరోగ్య అధికారులు డా.భరత్ కుమార్, డా.అరుణ్‌కుమార్, డా.మంజునాథ్ ,జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, డా.సురేశ్‌కుమార్, సూపర్‌వైజర్ గిరీశ్, డాక్టర్ ప్రియాంక, నాగభూషణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుటుంబ సంక్షేమాధికారి డా.రమేశ్‌బాబు

చనిపోయిన మూడు రోజులకు పోస్టుమార్టం

గోరంట్ల, నవంబరు13(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్ కాలనీకి చెందిన గర్భిణి జ్యోతిర బీదాస్ (23) మృతిచెందిన మూడు రోజులకు బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌లోని ధీరజ్‌జిల్లా ఫతేపూర్‌కు చెందిన ఆకున్‌సాబ్ కుమార్తె జ్యోతిరబీదాస్. అదే జిల్లాకు చెందిన బిస్వాస్ నాలుగేళ్లుగా గోరంట్లలో మొలల వైద్యుడిగా చికిత్సలు చేస్తున్నారు. ఆరునెలలక్రితం జ్యోతిరబీదాస్‌ను పెళ్లి చేసుకుని, రాజీవ్‌కాలనీలో నివసముంటుండేవారు. ఆమె మూడునెలల గర్భిణి. ఈనెల 10న బాత్‌రూమ్‌లో పడిందని గోరంట్ల ఆస్పత్రికి తీసుకొచ్చారు. అనంతరం హిందూపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందిన విషయం తెలిసిందే. హిందూపురం ఆసుపత్రి వైద్యులు పరీక్షించి, అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు భావించి, పోలీసులకు సమాచారం అందించారు. పురం మార్చురీలో ఆమె దేహాన్ని ఉంచారు. ఆమె తల్లిదండ్రులకోసం ఎదురుచూసినా వారు రాలేదు. దీంతో సీఐ శేఖర్, తహసీల్దార్ మారుతి ఆధ్వర్యంలో ఆమె మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేపడతామని సీఐ తెలిపారు.

300 మంది చిన్నారులకు

వండర్‌లాకు ఆహ్వానం

బెంగళూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత ఆహ్లాదకరం అనిపించే వండర్‌లా అమ్యూజ్‌మెంట్ పార్క్‌ను సందర్శించేందుకు 300 మంది చిన్నారులకు ఆహ్వానించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారుల ఆనందాన్ని పంచుకునేందుకు మేం సిద్ధంగా ఉన్నామని వండర్‌లా పార్క్ ఎండీ అరుణ్ కె చిట్టలపిల్లి ప్రకటించారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో అన్ని ప్రాంతాల నుంచి 300 మందిని ఎంపిక చేశామన్నారు. వారికి ఈనెల 17న ఆదివారం ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. సాధారణంగానే అన్నివర్గాల ప్రజలకు వండర్‌లా సందర్శించాలనే ఆసక్తి ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగానే వివిధ సంస్థల ద్వారా పేదవర్గాలకు చెందిన చిన్నారులకు ఎంపిక చేశామన్నారు. పిల్లలకు డ్రాయింగ్ పోటీలతో పాటు బహుమతులు ఇస్తామన్నారు.

నేడు తాలూకాలో విద్యుత్‌కోత

శిడ్లఘట్ట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకాలో ఈనెల 14న ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 4వరకు పలు గ్రామాల్లో విద్యుత్ కోత ఉంటుందని గ్రామీణ ఉపవిభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ప్రభు తెలిపారు. పట్టణంలో బుధవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జంగమకోటెలోని 66/11 కెవి సబ్‌స్టేషన్‌లో త్రైమాసిక నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. హెణ్ణంగూరు, హొసపేటె, భైరసంద్ర, నాగమంగల, జంగమకోటె, సుగటూరు, బళువల్లి, జె వెంకటాపుర చుట్టుపక్కల గ్రామాలలో విద్యుత్ కోత ఉంటుందని ప్రజలు సహకరించాలన్నారు.

బస్టాండ్ ప్రదేశాన్ని బాగు చేయండి



చాకవేలు బస్టాండ్ కూడలి ఇలా...

చేళూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకాలోని చాకవేలు గ్రామం బస్టాండ్‌లో ఒక మోస్తరు వర్షంతో బురదమయంగా మారింది. ఇప్పటికే గుంతలు ఉండగా వర్షపునీరు చేరి సంచారానికి అంతరాయం నెలకొంది. అలాగే గ్రామ పంచా యతీ కేంద్రం వద్ద కూడా ఇలాంటి పరిస్థితి నెలకొంది. బస్టాండ్ సహా ఇతర ప్రాంతాల్లోని రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

తాలూకా అధ్యక్షుడిగా హనుమంతరెడ్డి



హనుమంతరెడ్డి

బాగేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఆర్ హనుమంతరెడ్డి ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష స్థానానికి డాక్టర్ సిఎన్ సత్యనారాయణరెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ఆర్ వెంకట రామప్ప ప్రకటించారు. ఇప్పటికే నాలుగు సార్లు అధ్యక్షుడిగా వ్యవహరించిన హనుమంత రెడ్డి మరోసారి గెలుపొంది రికార్డు నెలకొల్పారు. రాష్ట్ర పరిషత్ స్థానానికి విద్యాశాఖకు చెందిన రంగారెడ్డి, కోశాధికారిగా రెవెన్యూశాఖకు చెందిన ప్రీతమ్‌లు ఏకగ్రీవమయ్యారు.

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న లోకాయుక్త సీఐ సంగమేష్

సిరుగుప్ప, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించాలని లోకాయుక్త సీఐ సంగమేష్ సూచించారు. బుధవారం సిరుగుప్ప పట్టణం శిశు అభివృద్ధి యోజన కార్యాలయ భవనంలో లోకాయుక్త అధికారులు తాలుకాలో నెలకొన్న సమస్యలు, ఫిర్యాదులను ప్రజల నుంచి స్వీకరించారు. రెవెన్యూ, నగర సభ, నీటి పారుదల శాఖకు సంబంధించి ఫిర్యాదులను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చినసమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు జరగడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరసభకు సంబంధించి అనధికృతంగా, అక్రమంగా రెండు భవనాలు అనుమతి లేకుండా నిర్మించడంపై రెవెన్యూ అధికారి రాజబక్షిపై విరుచుకుపడ్డారు. తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కీర్తన, తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ మడ్డేరు సిద్దయ్య, శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.00	1,602.74
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,971	7,151
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,062	7,993
నీటి నిల్వ (టీఎంసీలు)	99.90	25.27

డిసెంబరు 14న రాష్ట్రీయ లోక్ అదాలత్

● జిల్లా న్యాయాధికారి కేజీ శాంతి



బళ్లారి సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ తరపున డిసెంబరు 14న నగరంలోని కొత్త జిల్లా కోర్టు ప్రాంగణంలో రాష్ట్రీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవా సంస్థ అధ్యక్షురాలు కే.జి. శాంతి తెలిపారు. ప్రజలు తమ ప్రీ-లిటిగేషన్, నెగోషియబుల్ క్రిమినల్ కేసులు, బ్యాంక్ కేసులు, మోటారు వాహన ప్రమాద నష్టపరిహార వ్యాజ్యాలు, మ్యాట్రిమోనియల్, కుటుంబ కేసులు, సివిల్ కేసులు, ఇతర చర్చించదగిన కేసులను డిసెంబరు 14న నిర్వహించే మెగా లోక్ అదాలత్ ద్వారా త్వరగా పరిష్కరించుకోవచ్చని న్యాయాధికారి తెలిపారు. బళ్లారి, విజయనగరం జిల్లాల్లోని మొత్తం 31 కోర్టుల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయం, 08392-278077 నంబర్‌ను సంప్రదించండన్నారు.

ఆక్రమణల తొలగింపు



విశాల్‌మార్ట్ వద్ద ఆక్రమణల తొలగింపు

బళ్లారి సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం కప్పగల్లు రోడ్డులో విశాలమార్ట్ ఆక్రమణను కార్పొరేషన్ వారు తొలగించారు. మేయర్ ముల్లంగి నందీశ్ సమక్షంలో కార్పొరేషన్ సభ్యులు పి.గాదెప్ప, కే. హనుమంతప్ప, అధికారులను, సిబ్బందితో ఆక్రమణలను తొలగించారు. మేయర్ ముల్లంగి నందీశ్ మాట్లాడుతూ ప్రతి బుధవారం ఫుట్‌పాత్ క్లియర్ చేస్తామని తెలిపారు. ఇప్పటికే అనంతపురం రోడ్డు, ఆర్కే మిల్ రోడ్డు, తేరువీధి, బాపూజీ నగర్‌లోని కాళమ్మ వీధిలో కొన్ని ప్రాంతాలను క్లియర్ చేశామన్నారు.

నేకార సమాజ అభివృద్ధికి కృషి



ప్రముఖులతో చర్చిస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు దేవానంద

తోరణగల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నేకార సమాజ అభివృద్ధికి కృసి చేస్తానని ఆ సంఘం బళ్లారి జిల్లా, కేపీసీసీ ఓబీసీ ఉపాధ్యక్షుడు సీ దేవానంద అన్నారు. తోరణగల్లు స్టేషన్లో నేకార ఒక్కుట సమాజ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా సమాజం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. సండూరు తాలుకా స్థాయిలో సమాజం ఏర్పాటు చేసి చర్చించి సమాజ అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ పరంగా లభించే అవకాశాలు పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సండూరు తాలుకా అధ్యక్షుడు జక్కా తిప్పయ్య స్వామి, కార్యదర్శి గోపాల్, గౌరవ అధ్యక్షుడు వెంకటేశులు, గౌరవ సలహాదారులు పాండురంగ, రంగయ్య, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి ఉమామహేష్, సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తులసిపూజలు

కంప్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణంలో బుధవారం మహిళలు తమ ఇళ్ల ముందు తులసీపూజ ఉసిరి, తులసి చెట్టుకు పూజలు చేపట్టారు. అలాగే మహిళలకు ఒడినింపే కార్యక్రమం చేశారు. కార్తీకమాసంలో తులసీపూజ సందర్భంగా ఉసిరిచెట్టుకు విష్ణువుగా భావించి పూజలు నిర్వహిస్తామని మహిళలు తెలిపారు. కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో ఇళ్లలో మహిళలు పూజలు నిర్వహించారు.



సుశీల్ నగర్‌లో ఓటు వేసేందుకు వచ్చిన మహిళలు



దరోజీలో పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా

ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతం

కంప్లి/సండూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సండూరు నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. బీజేపీ, కాంగ్రెస్ తమ నాయకుల గెలుపు కోసం ఆయా పార్టీల శ్రేణులు కృషి చేశారు. ఉదయం ఎంపీ తుకారామ్, కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. కుడితిని పట్టణంలో నూతన దంపతులు గిరీష్, పుష్పావతి వివాహం రోజునే ఓటును వినియోగించుకున్నారు. దరోజీ, ఏళుబెంచి గ్రామాల్లో ఓట్లను ఉదయం నుంచి సాయంత్రం వరకు బారులుతీరారు. వృద్ధులు వారి త్రిచక్ర సైకిల్‌లో పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేశారు. జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా దరోజీలో పోలింగ్ బూత్‌లను, ఎన్నికల సరళిని పరిశీలించారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువతి కూడా తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. మొత్తానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కుడితిని పట్టణంలో రెండు వేలు నుంచి మూడు వేలు వరకు కాంగ్రెస్‌కు మెజార్టీ వస్తుందని నాయకులు రాజశేఖర్, అంజి, ప్రభు ధీమా వ్యక్తం చేశారు.



ఓటు వేసిన 91 ఏళ్ల వృద్ధురాలు



ఓటు హక్కును వినియోగించుకున్న లంబాడీ మహిళలు

రోడ్డు డివైడర్ గ్రిల్ నిరుపయోగం

బళ్లారిరూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో రైల్ బస్టాండు సమీపంలో అంబేడ్కర్ భవన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సైడ్ ఫుట్‌పాత్ గ్రిల్‌ను లక్షలాది రూపాయలు వెచ్చించి అమర్చారు. పట్టుమని ఆరు నెలలు గడవక ముందే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గ్రిల్స్‌ను కట్ చేసి పక్కనపడేశారు. అధికారులు ముందస్తుగా ప్లాన్ చేసుకుని ఇలాంటి గ్రిల్స్ అమర్చి వుంటే కార్పొరేషన్‌కు డబ్బు వృథా అయ్యేదికాదని నగరవాసులు అంటున్నారు. రోడ్డు వెడల్పు పనుల సందర్భంగా ఈ గ్రిల్స్‌ను కట్‌చేసి ఉండవచ్చని నగరవాసులు చెబుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న గ్రిల్స్

చిరుత కోసం బోన్ల ఏర్పాటు

రాయచూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరానికి సమీపంలోని మలియాబాద్ గ్రామ పరిసరాల్లో అటవీ శాఖ అధికారులు బుధవారం నాలుగు బోన్లు ఏర్పాటు ఏర్పాటు చేశారు. వారం రోజులుగా గ్రామస్థులు భయాందోళనకు గురవుతూ తమ గ్రామానికి చెందిన రైతుల పశువులు చిరుత దాడిలో మరణించాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన వీరేశ్ అనే రైతు ఎద్దు, రెండు దూడలపై చిరుత దాడి చేయడంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం అటవీ శాఖ అధికారుల బృందం 12 మంది అక్కడికి వెళ్లి వేర్వేరు ప్రాంతాల్లో గుట్ట చుట్టూ నాలుగు బోన్లను ఏర్పాటు చేసి ప్రజలకు తగిన హెచ్చరికలు జారీ చేశారు. డివిజన్ ఫారెస్టు అధికారి రాజేశ్ మాట్లాడుతూ రైతులు తమ పశువులను ఇంటి వద్దే కట్టేసుకోవాలని సూచించారు.

సిద్రాంపూర్ చెరువులో యువకుడి గల్లంతు

రాయచూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : నగరానికి సమీపంలో ఉన్న సిద్రాంపూర్ చెరువులో యువకుడొకరు గల్లంతయ్యాడు. మంగళవారం సాయంత్రం తన పెంపుడు గుర్రానికి స్నానం చేయించేందుకు చెరువుకు వెళ్లిన స్థానిక జహిరాబాద్ ఏరియాకు చెందిన అజీం(22) గుర్రానికి స్నానం చేసిన అనంతరం ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే అప్రమత్తమైన వారు అక్కడికి వెళ్లగా యువకుడు అప్పటికే నీటిలో మునిగిపోయినట్లు గుర్తించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది చేపల వేటగాళ్ల సహాయంతో యువకుడి శవం కోసం గాలింపు చేపట్టారు. బుధవారం చెరువు వద్ద పెద్ద ఎత్తున యువకుడి శవం ఆచూకీ కోసం గాలించారు. చెరువు నగరంలోని నేతాజీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుండగా సంబంధిత పోలీస్ అధికారులు కేసు నమోదు చేశారు.



అజీం(ఫైల్)



యువకుడి ఆచూకీ కోసం గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఊపందుకున్న ఖరీఫ్ వరికోతలు

● వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి: రైతులు

బళ్లారి సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మోక, కంప్లి, సిరుగుప్ప తాలూకా వ్యాప్తంగా సాగుచేసిన వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. తుంగభద్ర, హగరి నదుల నుంచి ఎత్తిపోతల పథకాలు, తుంగభద్ర కాలువలు, బోరు బావుల కింద 90 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. అత్యధికంగా ఆర్ ఎన్ఆర్ 15048 రకం 65శాతం వరకు సాగు చేయగా మిగిలిన 35శాతం సోనా మసూరీ (బీపీటీ5204)గిడ్డ సోనా, గంగా కావేరి రకాలు సాగు చేశారు. జూలై మొదటి వారంలో నాట్లు వేసిన వరి పంట సగటున 40 నుంచి 45 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయి. ఆగస్టు చివర్లో హగరి, తుంగభద్ర కాలవల కింద సాగుచేసిన వరి తల్లికోడు తెగులు వ్యాపించి దిగుబడి తగ్గి ఎకరానికి 20 నుంచి 30 బస్తాలు మాత్రమే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభం కాగా ధాన్యాన్ని మిల్లర్లు, వ్యాపారులు తక్కువ ధరకు కొంటున్నారు. ధాన్యం రకాల ప్రకారం క్వింటాలు రూ.1700 నుంచి 1800 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు ఏ-గ్రేడ్ రూ.2320 కాగా సామాన్య రకం రూ.2300 చొప్పున ధర పలుకుతుంది. మిల్లర్లు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు హులుగప్ప అన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని పేర్కొన్నారు.



యంత్రంతో వరి కోత



వరి కోతలో కూలీ కార్మికులు

అధికారులపై చర్యలు తీసుకుంటాం

● జిల్లా అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా



గ్రామస్థులతో ఆరా తీస్తున్న జిల్లా అధికారి

కంప్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మెట్రి గ్రామంలో మధ్యాహ్న భోజనంలో బల్లి పడి అస్వస్థతకు గురికావడంతో, ఇందుకు సంబంధించిన అధికారులపై నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. బుధవారం మెట్రి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు చేరుకుని అక్కడ స్థానికులతో జిల్లా అధికారి, పంచాయతీ సీఈవో రాహుల్ శరణప్ప సంకనూరు చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మధ్యాహ్న భోజనం వంటకాల గదుల విషయంపై, వంట చేసే వారిపైన ఫిర్యాదులు చేశారు. వారి నిర్లక్ష్యం వల్లే పిల్లలకు ఈ అవస్థలు ఏర్పడ్డాయన్నారు. ఇకపై అలా కాకుండా కమిటీని ఏర్పాటు చేసి మున్ముందు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారి తెలిపారు. ఇందుకు నిర్లక్ష్యం వహించిన ఏ అధికారి అయినా చర్యలు తీసుకుని నోటీసులు జారీ చేస్తామన్నారు. వారితో పాటు మధ్యాహ్న భోజనం అధికారి శివనాయక్, తహసీల్దార్ శివరాజ్‌కుమార్, ఈవో శ్రీకుమార్, పీడీవో శ్రీశైల గౌడ, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు

కంప్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కంప్లి తాలుకా నారాయణస్వామి క్యాంపులోని కోదండరామ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుధ అనే మహిళ కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మం, మహాలక్ష్మి రూపంలో ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నాఉ. ప్రతి ఏటా కోదండరామస్వామి ఆలయంలో వివిధ దేవతల చిత్రాలు వేస్తూ వస్తున్నారు. కార్తీక మాసంలో పలు ధార్మిక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు.



ఆలయంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రాన్ని ముగ్గుతో గీసిన మహిళ

ఓపెక్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సేవలు



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

రాయచూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఓపెక్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలతో కూడిన వైద్యసేవలు అందుబాటులో ఉన్నట్టు ఆస్పత్రి ప్రత్యేక అధికారి డా.రమేశ్ సాగర్ తెలిపారు. బుధవారం ఓపెక్ ఆస్పత్రి వద్ద రాయచూరు నగరసభ పౌర కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని నగరసభ అధ్యక్షురాలు నరసమ్మ మాడగిరితో కలిసి ఆస్పత్రి ప్రత్యేక అధికారి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హృద్రోగం, కాలేయం, మూత్రపిండాలు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యసేవలు అందించేందుకు నిపుణులైన వైద్యులు అన్ని విభాగాల్లో అందుబాటులో ఉన్నారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కల్తీ కల్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కల్తీ కల్లు బాటిళ్లు, నిందితులను చూపుతున్న పోలీసులు

రాయచూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిషేధిత కల్తీ కల్లుతో పాటు కల్లు తయారీ చేసేందుకు వినియోగించే సీహెచ్ పౌడర్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. నగరానికి చెందిన ఆరుగురు నిందితులు రైల్లో అక్రమంగా కల్లు, సీహెచ్ పౌడర్ తరలిస్తున్నారని పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ శాఖ పోలీసులు బుధవారం రాయచూరు రైల్వే స్టేషన్‌కు వెళ్లి బెంగళూరు-బీదర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో తనిఖీలు నిర్వహించారు. వీరంతా నగరానికి చెందిన బసవరాజ్, శ్రీకాంత్, శివరాజ్, తిమ్మప్ప, నరసమ్మ, మారెప్పలుగా గుర్తించారు. వీరు తెలంగాణ రాష్ట్రంలోని కృష్ణ గ్రామం నుంచి పెద్ద ఎత్తున కల్లును రాయచూరుకు తరలిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

మద్యంపై నిఘా వేయండి

● ఎక్సైజ్ శాఖ డీసీ నాగమద్దయ్య

అనంతపురం అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలలో నిబంధనల అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. దీనికోసం డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని సూచించారు. అనంతపురం ఈఎస్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డితో కలిసి ఏఈఎస్, సీఐలు, ఎస్ఐలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా బెల్టుషాపులు ఏర్పాటు చేయకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు. ఇప్పటికే ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహిస్తుంటే తక్షణమే దాడులు చేయాలని, నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమంగా మ ద్యం సరఫరా కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింతగా పెంచాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న డీసీ నాగమద్దయ్య

హోసూరు జోన్

158 మందికి రూ.89.34 లక్షల లబ్ధి

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా ఊత్తంగరై సర్కిల్ మారంబట్టి పంచాయతీ కణంబట్టి గ్రామంలో ప్రజాసంబంధాల ప్రాజెక్టు శిబిరం జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు నేతృత్వంలో బుధవారం జరిగింది. వివిధ పథకాలకు సంబంధించి 158మంది లబ్ధిదారులకు రూ.89.34 లక్షలను అందచేశారు. శిబిరంలో రెవెన్యూ, ఉద్యానవన శాఖ, వ్యవసాయ, పౌర ఆహార సరఫరాల శాఖ, సాంఘిక సంక్షేమ, దివ్యాంగుల వికలాంగుల సంక్షేమ శాఖ, ఆది ద్రావిడ సంక్షేమ, విద్యుత్, సహకార, ఐసీడీఎస్ తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రతినెలా ప్రజాసంబంధాల శిబిరాన్ని నిర్వహిస్తూ ప్రభుత్వం వివిధశాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి అధికారులు సమగ్రంగా వివరిస్తారు. ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. పిల్లలను 10, 12వ తరగతి వరకు మాత్రమే చదివించకుండా ఉన్నత చదువులకు ప్రోత్సహించాలని, తమిళనాడు ప్రభుత్వం విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, గుడ్లు, ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, ఉచిత సైకిళ్లను అదజేస్తోందని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. విద్యతోనే ప్రగతి సాధ్యమని ఆ దిశగా తల్లిదండ్రులు కూడా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయులతో చర్చించి విద్యా ప్రగతిని తెలుసుకోవాలన్నారు. కృష్ణగిరి దేవాదాయ శాఖ కమిషనర్ షాజహాన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పన్నీర్‌సెల్వం, జిల్లా సరఫరా అధికారిణి గీతారాణి, సమీకృత శిశు అభివృద్ధి కార్యక్రమ అధికారిణి జయంతి, దివ్యాంగుల సంక్షేమ అధికారి మురుగేశన్, జిల్లా ధర్మకర్తల కమిటీ చైర్మెన్ రజిని సెల్వం, యూనియన్ కమిటీ అధ్యక్షురాలు ఉషారాణి కుమరేశన్, ఊత్తంగరై జిల్లా కలెక్టర్ తిరుమళ్, జిల్లా అభివృద్ధి అధికారులు బాలాజీ, జిల్లా పంచాయతీ కమిటీ సభ్యుడు రత్నమాళ్ సుబ్రహ్మణి, పంచాయతీ కౌన్సిల్ ప్రెసిడెంట్ జి.హూమలర్, డిప్యూటీ జనరల్, మహావిష్ణు, వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన మేనేజర్ అరుళ్ సభ్యులు, ఆరోగ్య సేవల జాయింట్ డైరెక్టర్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



లబ్దిదారుకు ఇంటి పత్రాన్ని అందచేస్తున్న కలెక్టర్ సరయు

మైజా ట్రస్టుకు ఉర్దూ అకాడమీ ప్రశంసలు

హోసూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర ఉర్దూ అకాడమీ తరపున జాతీయ ఉర్దూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు, కవులు, రచయితలు, తదితరులకు చెన్నై స్టేట్ కళాశాల క్యాంపస్‌లో ప్రశంసా కార్యక్రమం జిల్లా స్థాయిలో హోసూరులో నిర్వహించారు. మైజా ఫౌండేషన్ విద్యా సేవలకు గుర్తింపుగా హోసూరు కాంగ్రెస్ నాయకుడు మైజా ట్రస్టు ముఖ్యులు అక్బర్‌ను సర్టిఫికెట్‌తో సత్కరించారు. ఉర్దూ స్కూల్ టేబుల్, కుర్చీలు, శుద్ధ తాగునీరు, విద్యార్థులకు ట్యూషన్ ఫీజు చెల్లింపుతో సహా విద్యా సేవలకుగాను ప్రశంసించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ నౌమూర్ రహమాన్, అబ్దుల్ రెహమాన్ అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రొ వైస్ ఛాన్సలర్ తాజ్జుద్దీన్ యూనివర్శిటీ ఆఫ్ చెన్నై డివిజన్ ప్రెసిడెంట్ అమానుల్లాతో పాటు పలువురు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందచేస్తూ...

శ్మశానవాటిక పరిశీలన

హోసూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 10 వ వార్డు వెంకటేశ్‌నగర్‌లోని శ్మశానవాటికల్లో గ్యాస్‌తో కూడిన అంత్యక్రియల విభాగాన్ని మేయర్ సత్య, కమిషనర్ శ్రీకాంత్ అకస్మిక తనిఖీలు చేశారు. ప్రజలకు పబ్లిక్ మరుగుదొడ్లు నిర్మించాలని, ప్రాంగణంలో పెరిగిన కంపచెట్లను తొలగించాలని, మురుగునీటి వ్యవస్థను సరిచేయాల్సి ఉందని స్థానికులు విన్నవించారు. స్మశానవాటికకు ప్రహరీ గోడ నిర్మించాలని, పార్కింగ్ చేయడానికి స్థలం కేటాయించాలని కోరారు. పరిశీలనలో ఎంపీపీ అంజప్ప, మురుగన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకరన్, అసిస్టెంట్ ఇంజనీర్ సెందిల్‌కుమార్ పాల్గొన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అర్బన్ ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్‌కు, జూనియర్ ఇంజినీర్ కుమార్‌లకు సూచించారు.



అధికారులకు సూచనలిస్తున్న మేయర్ సత్య, కమిషనర్ శ్రీకాంత్